సాక్షి పార్వతీపురం మన్యం

గురువారం । 12 । జూన్ । 2025



వసివాడుతున్న బాల్యం! - 8లో

చిన్న వయస్సులోనే పనులు చేస్తున్న బాల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు కనీసం ప్రాథమిక విద్య కూడా పొందకుండానే కార్మికులుగా మారుతున్నారు.



ఆర్టీసీ ఉద్యోగులలో ఆందోళన తొలగించాలి - 8లో

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సమ్మె చేస్తామని కలెక్టర్‌కు వినతులు అందజేశారు.

పైడితల్లి ఆలయ ఇన్‌చార్జి ఈఓగా శిరీష



విజయనగరం టౌన్‌: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ ఇన్‌చార్జి ఈఓగా కె.శిరీషను నియమిస్తూ దేవదాయశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్‌ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె పైడితల్లి దేవస్థానం ఈఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌చార్జి ఈఓగా పనిచేసిన కేఎన్‌వీడీవీ ప్రసాద్‌ను అరసవిల్లి దేవస్థానానికి బదిలీ చేశారు.

న్యూస్‌రీల్‌

కలెక్టర్‌ ఏరువాక



దత్తివలసలో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలస గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో కలెక్టర్‌ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ పాల్గొన్నారు. పొలంలో దుక్కిచేసి ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని దైవంగా భావించి ఆరాధించడం, వ్యవసాయ పనులను ప్రారంభించడం అనాదిగావస్తున్న సంప్రదాయమన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్‌, ఎంపీపీ ఉరిటి రామారావు, డీపీఎం పి.షణ్ముఖరాజు, వ్యవసాయాధికారి విజయభారతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జన్మనిచ్చిన ఏనుగు

- 9కి చేరిన ఏనుగుల గుంపు



ఏనుగుల గుంపు మధ్యన గున్న ఏనుగు (సర్కిల్‌లో)



ప్రసవ సమయంలో రక్షణగా ఉన్న ఏనుగుల గుంపు

సీతానగరం: మండలంలోని దట్టమైన తోటలున్న కోటసీతారాంపురంలో మూడు రోజులుగా ఏనుగుల గుంపు తిష్ట వేశాయి. ఓ ఆడ ఏనుగు బుధవారం మరో గున్న ఏనుగుకు జన్మనిచ్చింది. దీంతో ఏనుగుల సంఖ్య 9కి చేరింది. ఏనుగు ప్రసవ సమయంలో మిగిలిన 7 ఏనుగులు అడ్డుగోడగా నిలిచాయి. జనం కంట పడకుండా రక్షణ కల్పించాయి.

చిరుద్యోగులపై కూటమి కక్ష!



కలెక్టరేట్‌ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, సంచార పశు ఆరోగ్య సేవ వాహన సిబ్బంది

- తొలుత సంచార పశు ఆరోగ్య సేవలకు మంగళం
- రైతుల తిరుగుబాటుతో మళ్లీ ప్రారంభం
- నిర్వహణ బాధ్యతలు మరో సంస్థకు అప్పగింత
- గతంలో పనిచేసిన ఉద్యోగులను కాదని, కొత్తవారి నియామకానికి సన్నాహాలు
- ఆందోళనలో సంచార పశువైద్యసేవ సిబ్బంది

సాక్షి, పార్వతీపురం మన్యం:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి తీసుకొచ్చిన వ్యవస్థలకు మంగళం పాడటం.. లేకుంటే అందులో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుంది. పశువులకు పాడి రైతుల ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంచార పశు ఆరోగ్య సేవలను ప్రవేశపెట్టిన విషయం విదితమే. ఈ వాహనంలో డాక్టర్‌, సహాయకులు, డ్రైవర్‌ చొప్పున ముగ్గురు సిబ్బంది ఉంటారు. పశువులకు సంబంధించిన అన్ని మందులూ ఉంటాయి. ఒక్కో నియోజకవర్గానికి రెండు సంచార వైద్య సేవల వాహనాలను నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ మేరకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఎనిమిది వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. అనతి కాలంలోనే ప్రతి రైతు ముంగిట ఈ సేవలు గుర్తింపు పొందాయి. సంచార వాహన నిర్వహణను ఏజెన్సీకి అప్పగించగా... కూటమి ప్రభుత్వం వచ్చాక, ఈ సేవలను తగ్గిస్తూ వస్తోంది. కొద్ది రోజుల కిందటి వరకూ వైద్యసేవలను నిలిపివేసింది. ఇప్పుడు మరలా ప్రారంభించినా.. అందులో పని చేస్తున్న ఉద్యోగుల మెడపై కత్తి వేలాడదీస్తోంది.

సేవలూ.. దినదిన గండమే!



సంచార పశువైద్య వాహనం

ఏడాది క్రితం వరకు పశు సంచార ఆరోగ్య సేవలు సక్రమంగానే పాడిరైతులకు అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చింది మొదలు.. ఈ సేవలకు గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వం ఫేజ్‌ 1, ఫేజ్‌ 2 కింద వాహన సేవలను ప్రారంభించింది. గత ఫిబ్రవరి 15 నుంచి ఫేజ్‌ 1 వాహనాల సేవలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. తర్వాత కొన్నాళ్లకు ఫేజ్‌ 2 సేవలనూ నిలుపు చేశారు. మళ్లీ నిర్వహణ సంస్థను మార్పు చేసి మే ఒకటో తేదీ నుంచి పునఃప్రారంభించారు. వైద్యసేవలు ఎప్పుడు ఉంటాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఫోన్‌ చేస్తే 20 నిమిషాల్లోపు వాహనం రావడంతో మెరుగైన వైద్య సేవలు సాధ్యమయ్యేవి. కూటమి ప్రభుత్వ వైఖరితో ఈ సేవలకూ గ్రహణం పట్టుకుందని పాడిరైతులు వాపోతున్నారు.



ఉన్నవారిని తీసేసి.. కొత్తవారికి పోస్టింగ్‌

కూటమి నాయకులు తమ కార్యకర్తలకు ఉపాధి స్థావరాలుగా ప్రభుత్వ సేవలను మార్చేశారు. తాత్కాలిక ప్రాతిపదికన ఏళ్ల నుంచి పని చేస్తున్న వారిని తొలగించి, ఆ స్థానంలో తమవారిని నియమించుకునేలా అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. అందులో భాగంగానే సంచార పశు ఆరోగ్య సేవ ఉద్యోగులను తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారు. రాష్ట్రంలో 2022లో సంచార పశు ఆరోగ్య సేవ పథకం ప్రారంభించింది. అప్పటి నుంచి జీవీకే ఈఎంఆర్‌ఐ సంస్థ ఈ పథకాన్ని ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తోంది. గత ఏప్రిల్‌ 30వ తేదీ వరకు ఆ సంస్థే నిర్వహించింది. ఈ ఏడాది మే 1 నుంచి భవ్య హెల్త్‌ సర్వీసెస్‌ సంస్థ నిర్వహించడానికి ప్రస్తుత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. పాత సంస్థలో పనిచేసిన సిబ్బందిని కొనసాగించాల్సి ఉన్నప్పటికీ.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కొంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు సదరు సంస్థ పూనుకుంటోంది. ఇప్పటికే విజయనగరం జిల్లాలో పలువురిని తొలగించగా.. మన్యం జిల్లాకు సంబంధించి సీతానగరం ప్రాంతంలో పని చేస్తున్న పైలట్‌ (డ్రైవర్‌, హెల్పర్‌)ను రెండు రోజుల కిందట విధులకు రావద్దని చెప్పి.. ఆ స్థానంలో కొత్త వారిని నియమించుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఎనిమిది వాహనాలకు 24 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఎప్పుడు ఎవరిపై వేటు పడుతుందోనని తాత్కాలిక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని వారంతా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌ వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. వి.రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ, యూనియన్‌ నాయకులు ఎం.తిరుపతి, ఇ.గణేష్‌, సాయి చక్రవర్తి, వెంకటేష్‌, జి.మురళి, పి.శంకరరావు తదితరులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

దినదిన గండం



వైద్యసేవలే కాదు.. అందులో పనిచేస్తున్న వారి పరిస్థితి కూడా దినదిన గండంగా మారింది.ఏళ్లుగా నమ్ముకుని పనిచేస్తున్నాం. ఇప్పుడు నిర్వహణ సంస్థ మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులను తొలగిస్తున్నారు. ఇలా అయితే మా ఉపాధి కోల్పోయి, రోడ్డున పడతాం. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– ఎస్‌.సాయిచక్రవర్తి, పార్వతీపురం

ఉద్యోగుల తొలగింపు దుర్మార్గం

ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులను రాజకీయ కక్షతో తొలగించడం దారుణం. ఇది దుర్మార్గమైన చర్య. కాంట్రాక్టు సంస్థ మారినంత మాత్రాన అప్పటికే పనిచేస్తున్న ఉద్యోగులను తొలగిస్తామంటే ఎలా. కలెక్టర్‌ స్పందించి సంచార పశు ఆరోగ్య సేవ పథకంలో పనిచేస్తున్న 21 మంది ఉద్యోగులను యథావిధిగా కొనసాగించేందుకు చర్యలు చేపట్టాలి. లేదంటే ఆందోళన ఉద్ధృతం చేస్తాం.

– బి.వి.రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ఐదు తరగతుల నిర్వహణకు ఆధారమైన కె.ములగలోని పాఠశాల భవనం





సర్కారు బడి.. సమస్యలతో రెడీ..!

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు
- పనిచేయని ఆర్వో ప్లాంట్‌లు, మరమ్మతులకు గుర్రైన మరుగుదొడ్లు
- మంజూరుకాని యూనిఫాంలు



రావుపల్లిలో అసంపూర్తిగా ఉన్న తరగతి గది నిర్మాణం

పార్వతీపురం/సీతంపేట:

వేసవి సెలవులు ముగిశాయి. బడిగంట మోగే వేళయింది. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు చకచకా ముస్తాబవుతున్నారు. వీరికి పలు సమస్యలతో స్వాగతం పలికేందుకు చాలా సర్కారు బడులు రెడీ అయ్యాయి. అధ్వాన పరిసరాలు, మూలకు చేరిన ఆర్వో ప్లాంట్‌లు, అసంపూర్తి భవన నిర్మాణాలే కనిపిస్తున్నాయి. నాడు–నేడు నిధులతో పూర్తి చేయాల్సిన అదనపు భవన నిర్మాణాలు ఏడాదిగా నిలిచిపోవడంతో ఈ ఏడాది కూడా విద్యార్థులను వసతి సమస్య వెంటాడనుంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను చూసే హెల్త్‌ వలంటీర్లు లేరు. ఆరోగ్య కార్యకర్తలను నియమిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు కార్యరూపందాల్చలేదు.

నాడు సంస్కరణలు.. నేడు నిర్వీర్యం

ఏడాది కిందటి వరకు విద్యార్థులను ఊరి బడి ఆకర్షించేది. పాఠశాలల పునఃప్రారంభమంటే పండగలా ఉండేది. విద్యాకానుకలు, అమ్మఒడి, నాణ్యమైన ఆంగ్ల మీడియం చదువులు, అందంగా ముస్తాబైన పాఠశాలలు విద్యార్థులను మురిపించేవి. ప్రభుత్వం మారడంతో సర్కారు బడులకు ప్రాధాన్యం తగ్గిందని విద్యార్థుల తల్లిదండ్రులే చెబుతున్నారు. రెండోవిడత నాడు–నేడు పథకం కింద జిల్లాలోని 544 పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా వదిలేయడాన్ని తప్పుబడుతున్నారు. పేద, మధ్యతరగతి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే సర్కారు బడులపై కూటమి ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదంటున్నారు. ఆందోళనలు చేస్తే తప్ప తల్లికి వందనం నిధులు విడుదల చేయని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. మరోవైపు స్కూళ్ల విలీనం సన్నాహాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను గందరగోళానికి చేరిచేస్తున్నాయి.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ

పార్వతీపురం మన్యం జిల్లాలో 2,232 మంది బదిలీల కోసం దరఖాస్తు చేశారు. మొదటి రోజు 400 మందికి బదిలీ అయ్యింది. ఈ బదిలీ ప్రక్రియ మరో ఐదు రోజులు కొనసాగే అవకాశం ఉంది. అప్పటివరకు విద్యార్థులకు ఉపాధ్యాయులు దూరంగా ఉండనున్నారు.

యూనిఫాం పెండింగ్‌

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,503 ఉన్నాయి. ఈ పాఠశాలలో 89,173 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థి కిట్లు కింద నోట్‌ పుస్తకాలు 4,87,214 వచ్చాయి. 89,173 బ్యాగ్‌లు, 64,476 బెల్ట్‌లు, 89,168 షూస్‌ వచ్చాయి. విద్యార్థులకు సంబంధించి యూనిఫాం ఇంతవరకు మండల కేంద్రాలకు చేరలేదు.

బడులను బలోపేతం చేయాలి




ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి. కార్పొరేట్‌, ప్రైవేటు పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి. ఇప్పటికే జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్‌ పాఠశాలల్లో చేపడుతున్న దోపిడిపై అధికారులకు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ విధానం కార్పొరేట్‌ విద్యావ్యవస్థకు బలం చేకూర్చేలా ఉంది.

– పాలక రంజిత్‌కుమార్‌, గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

మెరుగైన వైద్య సేవలు అందించాలి

పార్వతీపురం రూరల్‌: జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, మాతాశిశు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు సంచాలకుడు కేవీఎస్‌ అనిల్‌కుమార్‌ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆరోగ్యసేవలపై సమీక్షించారు. రక్తహీనత నివారణ చర్యలపై ఆరా తీశారు. జనని మిత్ర హెల్త్‌ కేర్‌ యాప్‌ను పైలెట్‌ ప్రాజెక్ట్‌ కింద జిల్లాలో ప్రారంభిస్తామని, బందలుప్పి, డోకిశీల, పెదబొండపల్లి, గరుగుబిల్లి, రావివలస పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బందికి ముందుగా యాప్‌పై శిక్షణ ఇస్తామని తెలిపారు.

కుట్రపూరితంగానే సాక్షిపై దాడులు



- మహిళలను కించపరిచే వ్యాఖ్యలు ఎవరు చేసినా ఖండించాల్సిందే..
- గతంలో విజయమ్మ, భారతమ్మలపై నీచంగా మాట్లాడారు..
- నాడు కూటమి నేతలకు అది తప్పు అనిపించలేదా?
- మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌ సీపీ పీఏసీ సభ్యులు రాజన్నదొర

సాక్షి, పార్వతీపురం మన్యం/సాలూరు:

మహిళల పట్ల అసభ్యకరంగా ఎవరు మాట్లాడినా ఖండిస్తామని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌ సీపీ పీఏసీ సభ్యులు పీడిక రాజన్నదొర అన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎనలేని గౌరవ మర్యాదలు ఇస్తామని చెప్పారు. అలాంటి మహిళలను అసభ్యకర పదజాలాలతో విశ్లేషకులు సంబోధించడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. సాలూరులోని తన నివాస గృహంలో మీడియాతో ఆయన బుధవారం మాట్లాడారు. సాక్షి టీవీ డిబేట్లో కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకులు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నట్లు తెలిపారు. దానికి ఆయన క్షమాపణ చెప్పి వివరణ ఇచ్చుకున్నారని చెప్పారు. ఆ వ్యాఖ్యలను వైఎస్సార్‌ సీపీ అధినేత జగన్‌ మోహన్‌ రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డిలకు ఆపాదించడం తగదన్నారు. పార్టీ కూడా ఖండించిందని చెప్పారు.

ఈ వ్యవహారంలో డిబేట్‌ నిర్వహించిన సీనియర్‌ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం సరికాదన్నారు. గతంలో ఎల్లో మీడియాకు చెందిన టీవీ చానళ్లలో మహిళలను కించపరిచేలా జర్నలిస్టులు, విశ్లేషకులు వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. అది ఎవరికీ తప్పుగా కనిపించలేదా? అని ప్రశ్నించారు.

మాజీ సీఎం జగన్‌ కుటుంబాన్ని కించపరచలేదా?

గతంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌ రెడ్డి కుటుంబ సభ్యులను కించపరుస్తూ అనేకమంది వ్యాఖ్యలు చేశారని రాజన్నదొర తెలిపారు. అప్పుడు లేని కేసులు, అరెస్టులు ఇప్పుడెలా చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికీ వైఎస్‌ విజయమ్మ, భారతీరెడ్డిలను కించపరిచే వ్యాఖ్యలు సోషల్‌ మీడియాలో వైరల్‌ అవుతున్నాయని చెప్పారు. వాటిపై కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, అవితప్పుగా కనిపించడం లేదా? అని నిలదీశారు.

సమావేశాల్లో కావచ్చు.. ప్రెస్‌ మీట్లో కావచ్చు, డిబేట్లో గానీ.. మాట్లాడే వారే బాధ్యులు అవుతారని రాజన్నదొర అన్నారు. నిర్వహణ చేస్తున్న చానల్‌ పైన, ప్రింట్‌ మీడియాపైన తప్పును నెట్టడం భావ్యం కాదన్నారు. 'సాక్షి' మీడియాను కుట్రపూరితంగా మూసివేయాలని చూస్తున్నారని.. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆ కార్యాలయాలపై ఈ దాడులని అనుమానం వ్యక్తం చేశారు. దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

కూటమి ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చడానికే...

ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టామని రాజన్నదొర తెలిపారు. ఆ కార్యక్రమం రాష్ట్రమంతా విజయవంతమైందని.. ప్రజల్లో ప్రభుత్వంపైన అసమ్మతి పెరిగిందన డానికి ఇది నిదర్శనమని చెప్పారు. దీనిని కప్పిపుచ్చుకోవడానికి కూటమి ప్రభుత్వం రకరకాలుగా ఆలోచనలు చేస్తోందన్నారు.

గిరిజన బాలిక హత్యపై ఎందుకు స్పందించరు?

కూటమి ప్రభుత్వం మహిళల గురించి గొప్పగా చెప్పుకుంటోందని.. ఇదే సమయంలో అనంతపురం జిల్లాలో తన్మయ అనే గిరిజన అమ్మాయిని అన్యాయంగా చంపేశారని.. ఆ విషయంలో ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. కేసు పెట్టడం కాదని.. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సి ఉందన్నారు. గిరిజనశాఖ మంత్రి ఏ విధంగా ఆదుకుంటున్నారో.. హోం శాఖ మంత్రి ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఒక దళిత బాలికపై సామూహిక అఘాయిత్యం జరిగిందని.. సాలూరు నియోజకవర్గం సామంతవలస, మర్రివలస సమీపంలో యువతిని దారుణంగా ఉరి వేసి చంపేశారని.. సాలూరు మండలంలో గిరిజన ఎంపీటీసీని జుట్టు పట్టుకుని కొట్టారని... వారికి ఏ న్యాయం చేశారని ప్రశ్నించారు. అప్పుడు మహిళల పట్ల ఈ గౌరవం ఎందుకు కనిపించలేదన్నారు. తాము గానీ, తమ అధినేత గానీ ఎప్పుడూ మహిళలకు అగ్రతాంబూలం ఇస్తామని గుర్తు చేశారు. అబలల మనోభావాలకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఐసీడీఎస్‌లో.. డబ్బులే మాట్లాడతాయ్‌!

- ఇష్టానుసారం ఉద్యోగుల బదిలీలు
- రెండు గంటల్లోనే ఒకరి ఉత్తర్వులు తారుమారు
- ఆర్‌జేడీ కార్యాలయం నుంచే మొత్తం తతంగం
- నడిపిస్తున్న ఆ వ్యక్తి ఎవరు?



సాక్షి, పార్వతీపురం మన్యం:

ఐసీడీఎస్‌లో బదిలీలు పెట్టిన చిచ్చు.. చల్లారేలా కనిపించడం లేదు. అక్రమంగా సాగిన ఈ ప్రక్రియ కొంతమందికి లబ్ధి కలిగిస్తే.. మరికొందరికి ఖేదాన్ని మిగిల్చింది. విశాఖ జోనల్‌ పరిధిలో ఆర్‌జేడీ కార్యాలయం నుంచి సాగిన పైసా వసూల్‌ బదిలీలు.. చివరికి న్యాయస్థానం మెట్లు ఎక్కే వరకూ సాగేలా ఉంది. ప్రభుత్వం వివిధ శాఖల్లో బదిలీలకు అవకాశం కల్పించిన విషయం విదితమే. ఈ నెల 9వ తేదీతో ఆ ప్రక్రియ ముగిసింది. విశాఖ జోనల్‌ పరిధిలోని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ తంతు వివాదాస్పదంగా మారింది. మొత్తం ఆర్‌జేడీ కార్యాలయం నుంచి చక్రం తిప్పిన ఓ సీనియర్‌ సహాయకుడు.. ఉన్నతాధికారులకు భారీగా ముడుపులు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇష్టానుసారం, వేలంపాట మాదిరి చేపట్టిన బదిలీలే ఇందుకు సాక్ష్యంగా ఉన్నాయి.

- విజయనగరం జిల్లాలోని ఓ ప్రాజెక్టు సీడీపీవోను బదిలీ చేస్తూ సాయంత్రం 5.30కి ఉత్తర్వులు అందాయి. మరొకరికి ఆ స్థానంలో నియమించేశారు కూడా. అక్కడ నుంచి కదలడానికి ఇష్టపడని సదరు సీడీపీవో.. తనకున్న పలుకుబడితో కేవలం రెండు గంటల్లోనే ఉత్తర్వులు మార్పు చేసుకున్నారు. మరలా యథా స్థానంలో కొనసాగేందుకు సఫలీకృతులయ్యారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నగదు చేతులు మారినట్లు ఆ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.
- బదిలీలను ఇష్టానుసారం.. తమకు నచ్చిన విధంగా చేసి పడేశారు. రెండేళ్లు పూర్తి కాకపోయినా.. 'రిక్వెస్ట్‌' పెట్టుకోకపోయినా స్థానచలనం కలిగించారు. ఓ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌.. కనీసం విజ్ఞప్తి కూడా పెట్టుకోలేదు. ఆమెకు 'రిక్వెస్ట్‌' పెట్టుకున్నట్లుగా కారణం చూపుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేశారు.
- చీపురుపల్లి నియోజకవర్గం నుంచి గ్రేడ్‌–2 సూపర్‌వైజర్‌గా రెండేళ్ల కిందట ఉద్యోగోన్నతిపై ఒక సూపర్‌వైజర్‌ గజపతినగరం నియోజకవర్గంలోని ప్రాజెక్టుకు వెళ్లారు. వాస్తవానికి ఆమెకు బదిలీకి అవకాశం లేదు. తాజా బదిలీల్లో ఆమెను తన సొంత ప్రాంతమైన చీపురుపల్లి నియోజకవర్గానికే మరలా వేయడం గమనార్హం. ప్రస్తుతం పనిచేస్తున్న చోట రెండేళ్లయినా సర్వీసు పూర్తి కాని ఓ సూపర్‌వైజర్‌కు భోగాపురం నుంచి గంట్యాడ పోస్టింగ్‌ ఇచ్చారు.
- వితంతువులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కాస్త వెసులుబాటు ఇవ్వాల్సి ఉంది. ఈ శాఖలో వితంతువుల విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కోలా వ్యవహరించారు. కేన్సర్‌తో బాధ పడుతున్న ఓ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌.. చికిత్సకు వీలుగా ఉంటుందని, విశాఖపట్నంలో తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసుకున్నారు. ఆమె విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రస్తుతం ఉన్నచోటే ఉంచేశామని.. సంతోషించాలని ఆర్‌జేడీ కార్యాలయం నుంచి సమాధానం రావడం విశేషం. ఎవరికో లబ్ధి కలిగించాలని.. వేరెవరినో బలిచేస్తూ బదిలీల తంతు సాగింది. 50 ఏళ్ల దాటిన వారికి ఏజెన్సీలోని కొండ ప్రాంతాలకు వేశారు.
- పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం నుంచి ఓ సూపర్‌వైజర్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. మన్యం జిల్లాలో ఆ స్థానంలోకి కొత్తగా వస్తున్న వారు విధుల్లో చేరితేనే.. ప్రస్తుతం ఉన్నవారిని రిలీవ్‌ చేయాలని కలెక్టర్‌ స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదే సమయంలో విజయనగరం జిల్లాలో ప్రస్తుతం ఉన్న సూపర్‌వైజర్లు ఇంకా రిలీవ్‌ ఆర్డర్లు తీసుకోకుండానే సీడీపీవోలు అత్యుత్సాహం చూపినట్లు తెలుస్తోంది. తమకు కొంత సమయం ఇవ్వాలని కోరుతున్నా.. సంబంధిత సూపర్‌వైజర్లను రిలీవ్‌ చేస్తున్నట్లుగా వారి వ్యక్తిగత మెయిల్‌కు ఆర్డర్లు పంపేశారు.

చక్రం తిప్పుతున్న ఆ వ్యక్తి ఎవరు?

ఐసీడీఎస్‌లో వేలంపాట మాదిరి జరిగిన బదిలీల తంతులో ఆర్‌జేడీ కార్యాలయం చుట్టూనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారికి లబ్ధి కలిగించేందుకు ఓ సీనియర్‌ సహాయకుడు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. గతంలో విజయనగరం జిల్లాలోని ఓ ప్రాజెక్టు సీడీపీవో వేధింపులు భరించలేక.. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వివరాలను గోప్యంగా ఉంచుతూ, విషయాన్ని లేఖ రూపంలో ఆర్‌జేడీ కార్యాలయానికి పంపారు. దీనిపై ఎటువంటి విచారణ కూడా చేపట్టకుండా సదరు ఉద్యోగితోపాటు.. మరో కీలకాధికారి ఆ ఫిర్యాదును కనుమరుగు చేసినట్లు సమాచారం. మరోవైపు అస్తవ్యస్తంగా చేపట్టిన బదిలీలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పలువురు ఉద్యోగులు న్యాయస్థానం తలుపుతట్టేందుకు సిద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

16 నుంచి కబడ్డీ టీమ్‌కు శిక్షణ


శిక్షణ వివరాలు వెల్లడిస్తున్న కొండలరావు

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా అండర్ 18న కబడ్డీ టీమ్‌కు శిక్షణ ఈ నెల 16 నుంచి ప్రారంభిస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం కబడ్డీ అసోసియేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అండర్ 18 కబడ్డీ టీమ్ జాతీయస్థాయిలో పాల్గొనడానికి క్రీడాకారులకు శిక్షణ అందిస్తామన్నారు. ఈ నెల 28 నుంచి హరిద్వార్‌లో జరగనున్న జాతీయస్థాయి అండ్ 18 కబడ్డీ పోటీల్లో పాల్గొనదలచిన వారికి శిక్షణ అందిస్తామని, వారికి ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ 9440529144 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోడి సుదర్శనరావు, కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్, కోశాధికారి శనగల సీతారాం, సభ్యులు కాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం


ప్రమాదంలో కాలిపోయిన ప్రింటర్ తదితర సామగ్రి

వేపాడ: మండలంలోని భర్తవానిపాలెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో దుకాణంలోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై బాధితుడు పోతల రాము నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారు జామున తన షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో ప్రింటర్‌తో పాటు నోట్‌బుక్స్, ఇతక సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుత్ మీటర్ కాలిపోయిందని, ఫ్రిజ్ పాక్షికంగా కాలిపోయిందని, సుమారు ఏభై వేలు రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఆమె చూపు పదిలం


జగదాంబ (ఫైల్)

చీపురుపల్లి: మరణానంతరం చూపు పదిలంగా ఉండాలంటే నేత్రదానం చేయాలి. అప్పుడే ఆ నేత్రాలు నిరంతరం సజీవంగా ఉంటాయి. అందులో భాగంగానే చీపురుపల్లి పట్టణానికి చెందిన అంధవరపు జగదాంబ చూపు కూడా నిరంతరం పదిలంగా ఉండనుంది. దీనికి ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేయడమే కారణం. పట్టణంలోని ఆంజనేయపురంలో నివాసం ఉంటున్న ఆంధవరపు జగదాంబ(57) బుధవారం ఉదయం మృతిచెందారు. దీంతో పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు అక్కడికి వెళ్లి నేత్రదానంపై కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. దీంతో మృతురాలి భర్త అంధవరపు నర్సింగరావు తన భార్య నేత్రాలు దానం చేసేందుకు అంగీకరించగా విజయనగరం రెడ్‌క్రాస్ సొసైటీ టెక్నీషియన్ రమణ, సుధాకర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి నుంచి కార్నియా సేకరించారు.

సీతం అధ్యాపకుడికి గుర్తింపు

- ఆన్‌లైన్ పరీక్షల్లో ప్రతిభ


అధ్యాపకుడు మధుబాబును అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు, అధ్యాపకులు

విజయనగరం అర్బన్: ఐఐటీ మద్రాస్ నిర్వహించిన నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీస్ ఎన్‌హేన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) జాతీయస్థాయి ఆన్‌లైన్ పరీక్షల్లో ప్రతిభ చూపిందుకు విజయనగరం పట్టణంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు మొగలి మధుబాబుకు 'ఎన్‌పీఈఎల్ స్టార్ బిలీవర్'గా గుర్తింపు లభించింది. ఈ మేరకు బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన నాలుగు విభిన్న సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించారు. జూలైలో ఐఐటీ మద్రాస్‌లో జరగనున్న ప్రత్యేక 'స్టార్ బిలీవర్స్' వర్క్‌షాప్‌కు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మధుబాబును కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డార్టర్ దామోదరనాయుడు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹194

వసివాడుతున్న బాల్యం!

అభంశుభం తెలియని చిన్నారులు ఆడుతూ పాడుతూ గంతులేయాల్సిన వయసులో కుటుంబ బాధ్యతలు మోస్తున్నారు. బడికి పోవాల్సిన బాలలు బండెడు చాకిరీలో మగ్గిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా బడి ముఖం చూడని బాలలు 20 కోట్ల పైనే అని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఇంకా లెక్కల్లోకి రాని వారెందరో..మన దేశంలోనే ప్రతి ముగ్గురిలో ఒకరు బడి ముఖం చూడని వారున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు పిల్లలను పనిలో పెట్టేలా ప్రోత్సహిస్తుండడంతో..వ్యాపార వర్గాల వారు కూడా తక్కువ వేతనంతో ఎక్కువ పనిని బాలలతో చేయిస్తున్నారు. కొందరు బాలలైతే ప్రమదకర పరిస్థితుల్లో కూడా పనులు చేస్తూ బాల్యాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. నేడు ప్రపంచ బాల కార్మిక నిర్మూలన దినం సందర్భంగా..


పని ప్రదేశంలో బాలలు

- పనుల్లో నలిగిపోతున్న పిల్లలు
- నేడు ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం

విజయనగరం గంటస్తంభం: చిన్న వయస్సులోనే పనులు చేస్తున్న బాల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు కనీసం ప్రాథమిక విద్య కూడా పొందకుండానే కార్మికులుగా మారుతున్నారు. వారిలో పోషకార లోపం కారణంగా శారీరక ఎదుగుదల సరిగ్గా ఉండడం లేదు. అనేక మానసిక, శారీరక ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. యాజమాన్యాలు బాల కార్మికులతో ఎక్కువ పనిచేయిస్తూ, తక్కువ వేతనాలు ఇస్తున్నాయి. కొంతమంది బాలలు వారి సామర్థ్యానికి మించి పనులు చేయాల్సి వస్తోంది. ప్రమాణాలకు అనుగుణంగా లేని ప్రమాదకర పరిస్థితుల్లో సైతం బాలలు పనిచేస్తున్నారు. బాలకార్మికులు భౌతిక, లైంగిక దాడులను ఎదుర్కోవాల్సి వస్తోందని అనేక నివేదికలు వివరిస్తున్నాయి.

భవిష్యత్ అంధకారం..

బాల కార్మికులుగా కొనసాగిన వారు భవిష్యత్‌లో ఉన్నతమైన జీవితాన్ని గడిపేందుకు అవకాశాలు తక్కువగా ఉంటాయి. వారికి సరైన విద్య లేకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. పోటీతత్వం నిండిన సమాజంలో అన్నిరకాలుగా వెనుకబడిపోతున్నారు. పెద్దవారయ్యాక సరైన ఉపాధి దొరకని కారణంగా పలువురు నేరాలకు పాల్పడుతున్నారు.


ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం అనుబంధ చిత్రం

ఏటా బాలకార్మిక వ్యతిరేక దినం

ఏటా జూన్ 12న దాదాపు 100 దేశాల్లో బాల కార్మికుల వ్యతిరేక దినం నిర్వహిస్తారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా అవగాహన తీసుకురావడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ సంయుకత ఆధ్వర్యంలో ఈ దినాన్ని నిర్వహిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం పిల్లలు ఏదో ఒక పనిలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాలు, పట్టణల్లో పనులు ఎక్కువగా లభిస్తున్నందున చిన్నారుల వలసలు కొనసాగుతున్నాయి. అలా మారడానికి కారణం అధిక జనాభా, నిరక్షరాస్యత, పేదరికం వంటి కారణాలతో బడి ఈడు పిల్లలు చదువుకు దూరమవుతున్నారు.

బాలలను పనిలో పెడితే... కఠిన చర్యలు



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాధ్యత అందరిపై ఉంది. చిన్నారులను పనిలో పెట్టినా, వారితో పనులు చేయించినా చట్టారీత్యా నేరం. బాల కార్మికులు ఎక్కడ కనిపించినా 1098, 100, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నాం. విజయనగరం జిల్లాలో అన్ని శాఖల వారీగా 2020–24 సంవత్సరాల మధ్య మొత్తం 576 పిల్లలను రక్షించాం. ఈ ఏడాది జూన్ 1తేదీ నుంచి ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ స్పెషల్ డ్రైవ్ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ఎక్కువగా ఉండే మార్కెట్లు, కూడళ్లు, ఇటుక బట్టీలు, మోకానిక్ షెడ్లు, వస్త్ర దుకాణాలు తదితర ప్రాంతాల్లో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతి బుధవారం బాలకార్మికుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. ఈనెల 31 వరకు ఈ డ్రైవ్ కొనసాగుతుంది. చిన్నారులను పనులకు పంపిస్తే జరిగే అనర్థాలు, చట్టాలపై గ్రామాల్లోనూ అవగాహన కల్పిస్తున్నాం.

ఎస్‌డీవీ ప్రసాదరావు,
జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్

అడ్డగోలు అవిశ్వాసం సంపూర్ణం


అవిశ్వాస తీర్మాన సమావేశంలో చేతులెత్తుతున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

బొబ్బిలి: టీడీపీ నాయకులు పదవీ కాంక్షతో చేపట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీకి పజలు కట్టబెట్టిన మున్సిపల్ చైర్మన్ పదవిని కౌన్సిలర్లను ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకున్న టీడీపీ నాయకులు వైస్‌చైర్మన్ పదవిని కూడా అదే అవిశ్వాసంతో రాజకీయం చేసి తమ వైపు తిప్పుకున్నారు. దీంతో అడ్డగోలు అవిశ్వాసం పూర్తయినట్లయింది. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామమోహన రావు ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో అవిశ్వాసం తీర్మాన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ముందుగా కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారని, ఇందుకు అనుకూలంగా చేతులెత్తాలని ఆర్డీఓ రామమోహన రావు కోరారు. దీంతో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే బేబీ నాయన చేతులెత్తడంతో మూడవ వంతు కౌన్సిలర్లు (22మంది) చేతులెత్తారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీకి చెందిన రెండో వైస్ చైర్మన్ చెలికాని మురళీకృష్ణ కూడా చేతులెత్తడంతో సంఖ్యాపరంగా సరిపోవడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ఆర్డీఓ ధ్రువీకరించారు. అనంతరం వారితో సంతకాలు చేయించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. కాగా ఈ అవిశ్వాస తీర్మానానికి వైఎస్సార్‌సీపీకి చెందిన కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాలేదు. వారంతా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోనే ఉండిపోయారు.

మెట్టవలసలో డీఎంఓ పర్యటన

సాక్షి ఎఫెక్ట్


మృతిచెందిన గిరిజన విద్యార్థిని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డీఎంవో వై.మణి

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ పరిధి మెట్టవలస గిరిజన గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థికి కుడుమూరు మేఘన (14) ఈనెల 9వ తేదీ రాత్రి విషజ్వరంతో మృతిచెందిన సంఘటన తెలిసిందే. అయితే ఈ విషయాన్ని విషజ్వరంతో గిరిజన విద్యార్థిని మృతి శీర్షికన ఈ నెల 11న సాక్షి వార్త ప్రచురించింది. ఈ వార్తకు స్పందించిన డీఎండ్‌హెచ్‌వో మెట్టవలస గ్రామాన్ని సందర్శించి మేఘన మృతికి గల కారణాలతో పాటు అక్కడ వైద్యశిబిరం నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారిణి వై.మణిని ఆదేశించారు. దీంతో ఆమె బుధవారం మెట్టవలస గిరి జన గ్రామాన్ని సందర్శించి మృతిచెందిన గిరిజన విద్యార్థిని తల్లిదండ్రులు సూర్యనారాయణ,సంధ్యలను పరామర్శించారు.అలాగే మేఘన ఎలా మృతిచెందింది? మృతికి గల కారణాలేంటి? ఎన్ని రోజులు జ్వరం వచ్చింది? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మృతురాలి కుటుంబసభ్యులతో పాటు వారి ఇంటి చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో ఒకరిద్దరికి వైరల్ జ్వరాలు ఉండడంతో వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు.సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ఎస్సైకి ఎస్పీ ప్రశంసలు



ఆంధ్ర ఎస్సైని అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ఆంధ్ర పోలీస్ స్టేషన్ పరిధి బీరసాడవలన గ్రామసమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరి ప్రాణాలను ఆంధ్ర ఎస్సై కె.సీతారామ్ కాపాడారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. అనంతరగిరి మండలం రొంపల్లి పంచాయతీ గూడెంకు చెందిన గెమ్మెల రాంబాబు, గెమ్మెల అప్పలస్వామిలు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే వారు డయల్ 100, 112 నంబర్‌కు సమాచారం ఇవ్వగా సకాలంలో ఎస్సై సీతారాం స్పందించి ఘటనా స్థలికి చేరుకుని, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ ఇద్దరిని 108 సిబ్బంది సహకారంతో అంబులెన్స్‌లో ముందుగా గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ఆ ఇద్దరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం గాయపడిన ఇద్దరు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనను స్పెషల్ బ్రాంచ్ ద్వారా తెలుసుకున్న ఎస్పీ వకుల్ జిందల్ ఆంధ్ర ఎస్సై సీతారాంను అభినందించారు.

రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో 11 రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు మంజూరు చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధ్యక్షతన వర్చువల్ విధానంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీ సమావేశంలో కురుపాం మండలంలోని సందిగూడ నుంచి కాగుమాను గూడ వరకు 820 మీటర్ల రహదారి నిర్మాణానికి, కాగుమానుగూడ నుంచి సాలిదంగు వరకు 820 మీటర్ల రహదారి, పొద్దీస నుంచి సాలమానుగూడ వరకు 1320 మీటర్ల రహదారి, సాలమాను గూడ నుంచి చాపరాయిగూడ వరకు 1300 మీటర్ల రహదారి, దాము గూడ నుంచి చినబంటుజోల వరకు 815 మీటర్లు, మంటికొండ నుంచి దాముగూడ వరకు 733 మీటర్లు, జె పులుపుట్టి నుంచి వై పులిపుట్టి వరకు 1140 మీటర్లు, జాజరుగూడ నుంచి జె పులుపుట్టి వరకు 1120 మీటర్లు, తిత్తిరి నుంచి దొమ్మిడి వరకు 1208 మీటర్లు, దొమ్మిడి నుంచి గాలిమానుగూడ వరకు 1034 మీటర్లు, తిత్తిరి నుంచి గునుగూడ వరకు 1197 మీటర్ల రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. ఈ రహదారులు గిరిజన ఆవాసాలను బయట ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు అత్యావశ్యమని కమిటీ భావించింది. త్వరగా రహదారుల నిర్మాణం పూర్తిచేసి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పాలకొండ సబ్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గజపతినగరం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి సుమారు 50ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడడం కానీ, రైలు ఢీకొట్టడంతో కానీ జరిగిన ప్రమాదంలో తల, మొండెం వేరువేరుగా పడి ఉన్నాయన్నారు. మృతుడి శరీరంపై బ్లూకలర్ జీన్ ఫ్యాంట్, వైట్ కలర్ షర్ట్, షర్ట్ కాలర్‌పైన శ్రీశక్తిసాయ్ కాటన్ షర్ట్స్ 44అని ఆంగ్ల అక్షరాలు ఉన్నట్లు చెప్పారు. గుర్తు పట్టగలిగిన వారు వెంటనే విజయనగరం జీఆర్పీ ఎస్సై వి.బాలాజీరావు ఫోన్ 9490617089, నంబర్‌కు లేదా హెచ్‌సీ నంబర్ 8309901038,9491813163లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

అండర్–14 క్రికెట్ పోటీల్లో 'విఘ్నేష్' సత్తా

- దూసుకుపోతున్న తెర్లాం యువకుడు
- ముంబైలో జరుగుతున్న టోర్నమెంట్
- టోర్నమెంట్‌లో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ
- రెండు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కైవసం


సెంచరీ చేసి అభివాదం చేస్తున్న విఘ్నేష్


మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అందుకుంటున్న విఘ్నేష్

తెర్లాం: ముంబైలో జరుగుతున్న అండర్–14 క్రికెట్ టోర్నమెంట్‌లో తెర్లాం మండలం ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన యువకుడు పైల విఘ్నేష్ రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ చేసి సత్తా చాటాడు. టోర్నమెంట్‌లో ఓ జట్టు తరుపున విఘ్నేష్ పాల్గొన్నాడు. ఈ పోటీల్లో రెండుసార్లు మేన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా ఎంపికయ్యాడు. ఒక మ్యాచ్‌లో 91 బంతుల్లో 104 పరుగులు, మరో మ్యాచ్‌లో 62 బంతుల్లో 114 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ముంబైలో పలు రాష్ట్రాలకు చెందిన క్రికెట్ అకాడమీలు నిర్వహించే టోర్నమెంట్‌లో విఘ్నేష్ ఈ ఘనతను సాధించాడు. అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న విఘ్నేష్‌ను మండలానికి చెందిన పలువురు అభినందించారు. విఘ్నేష్ తండ్రి పైల గణపతి ఎస్.బూర్జవలస పంచాయతీ సర్పంచ్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులలో ఆందోళన తొలగించాలి

- నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిమాండ్


కలెక్టరేట్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఉన్న పార్వతీపురం, పాలకొండ, సాలూరు ఆర్టీసీ డిపోల సమస్యలపై ఏపీపీటీడీ, డీపీటీఓలకు అనేక మార్లు మెమొరాండాల ద్వారా సమస్యల పరిష్కారానికి తెలియజేసినప్పటికీ ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదు. పైగా మరిన్ని సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆందోళన, అభద్రత తొలగించి జిల్లాలో పారిశ్రామిక శాంతి నెలకొల్పాలి. ఈ మేరకు బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను, గతంలో యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అంగీకరించారు. అయినప్పటికీ అమలు చేయని అంశాలపై జోనల్ కౌన్సిల్‌లో సుదీర్ఘ చర్చ జరిపి సామరస్య పూర్వకంగా చేసే ఉద్యమాలకు యాజమాన్యం కనీసం స్పందించడం లేదు. ఈ పరిస్థితుల్లో 'సమ్మె నోటీసు' ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశామని ఈ నెల 25 తరువాత ఎప్పుడైనా జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు సమ్మెకు సిద్ధం అవుతారని పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ చొరవ తీసుకుని సిబ్బంది సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆర్టీసీ జిల్లా, డిపో అధికారులను ఆదేశించి సమ్మె జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. కలెక్టర్‌కు 30 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం


కలెక్టరేట్ అధికారులకు అందజేసిన వినతిపత్రంతో ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, 15 రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని ఆర్టీసీ ఎన్ఎంయూ జోనల్ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు బుధవారం ఆరు జిల్లాల సంఘం నాయకులు కలిసి తమ సమస్యలు వినిపించారు. అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. యూనియన్ నాయకులపై దౌర్జన్యం, అనారోగ్య సెలవులు పెట్టిన ఉద్యోగుల జీతాలు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పీజీ రాఫెల్, డిపో కమిటీ నాయకులు బి.రామారావు, ఎం.కృష్ణ, వై.విష్ణు, గురుమూర్తి, జి.ప్రభాకరరావు, ఎస్.కోట డిపో అధ్యక్ష, కార్యదర్శి ఎ.రాజయ్య, జి.వి.రమణ, తదితరులు ఉన్నారు.

సబ్‌జైల్ ఆకస్మిక తనిఖీ


సబ్ జైలును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. నేర ప్రవృత్తిని విడనాడాలని సూచించారు. జైలులో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యమన్నారు. ఖైదీల పట్ల సిబ్బంది, తోటి ఖైదీలు ఎటువంటి వివక్ష చూపించరాదన్నారు. అనంతరం సబ్ జైల్‌లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. పారా లీగల్ వలంటీర్ల విధులపై ఆరా తీశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని, భోజనశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను సందర్శించి వంట సరుకులను పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ , సబ్ జైల్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

నిజజీవితంలో స్మార్ట్ స్కిల్స్ అవసరం

- జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి


స్మార్ట్ స్కిల్స్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధి పనిలోనే కాకుండా నిజ జీవితంలో కూడా స్మార్ట్ స్కిల్స్ అవసరమని జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ డి.రాజ్యలక్ష్మి అన్నారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో 'స్మార్ట్ స్కిల్స్ ఫర్ ఏ సెక్యూర్ ఫ్యూచర్' అనే అంశంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి చెందేందుకు వయస్సుతో సంబంధం లేదన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సాఫ్ట్‌స్కిల్స్‌పై నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఈసీఈ ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.హేమ పర్యవేక్షణలో వర్క్‌షాప్ రి సోర్స్ పర్సన్స్‌గా ఎస్‌బీఐఎల్‌డీ చీఫ్ మేనేజర్ (ఫ్యాకల్టీ) సురేష్ కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ వి.అభినాష్, డాక్టర్ కె.శ్రీకాంత్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.రాజేశ్వరరావు, ఎస్‌బీఐ అధికారులు, ఎం.సురేష్ బాబు, ఎ.శ్రీనివాసరావు, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మాన్ పనులు పూర్తి చేయాలి

పార్వతీపురం రూరల్: పీఎం జన్‌మాన్ కింద మౌలిక సదుపాయాల కల్పన పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పనుల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్‌లో బుధవారం సమీక్షించారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగానికి 19 పనులను రూ.39.56 కోట్లతో మంజూరు చేసినట్టు వెల్లడించారు. నాబార్డు కింద రూ.15.34 కోట్లతో మంజూరు చేసిన 10 పనులకు వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ పథకం కింద రూ.90 కోట్లతో 581 పనులు మంజూరు చేయగా 453 పనులు పూర్తయ్యాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రచయితలు, కవులకు అవార్డులు

యోగాంధ్రలో భాగంగా చక్కని సంగీతంతో పాడిన యోగా పాటకు రూ.లక్ష అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. దీనిపై ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించే రిహార్సల్స్‌ను స్థానిక గాయకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాతావరణ మార్పులు దృష్ట్యా 12వ తేదీన యోగాసన ప్రక్రియను రద్దుచేసినట్లు తెలిపారు.